

మీ గురించి మీకు తెలియనప్పుడు
మాత్రమే అజ్ఞానం
చోటు చేసుకుంటుంది.
తనను తాను తెలుసుకుంటూ
ఉండటం వివేకం


# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA AUG. 2007 - NOV. 2007 Rs.2/- VOL. II ISSUE 1


## ఈ వసుధ మనందరిదీ

ప్రాత: కాలంలో నీటి మీద మెరిసే సూర్యకిరణాల కాంతిని మీలో ఎవరైనా గమనించారో లేదో నాకు తెలియదు. చెప్పలేనంత సుతిమెత్తగా ఉంటుంది ఆ కాంతి. నల్లని నీళ్ళు నృత్యం చేస్తుంటాయి. పైన చెట్ల కొసన, ఆకాశాని కంతటికీ ఒకే ఒక నక్షత్రం – వేగుచుక్క మిణుకు మిణుకు మంటూ ఉంటుంది. వీటిలో ఏవైనా మీరు గమనిస్తూ వుంటారా? మీకసలు తీరికే లేదంటారా? ఎన్నో వ్యాపకాలలో, ప్రతి రోజూ చేసే దినకృత్యాలలో మునిగి పోయి ఈ వసుధ అందచందాలను, ఆ సౌందర్య సంపదను ఎన్నడూ పట్టించుకోలేదా? లేక పూర్తిగా మర్చిపోయారా? మనందరమూ జీవించవలసినది ఈ వసుధపైనే కాదూ! మనల్ని మనం కమ్యూనిస్టులమనో, పెట్టుబడిదారులమనో అనుకోవచ్చు; హిందువులమనో, బౌద్ధులమనో, ముస్లిములు, క్రైస్తవులూ ఏమయినా అనుకోవచ్చు– అంధులమవచ్చు, అంగవైకల్యం వుండచ్చు – ఆరోగ్యవంతులవచ్చు, ఆనంద జీవులవచ్చు– ఎవరమయినా సరే మనందరిదీ ఈ భూమి.

అర్థమవుతున్నదా? ఇది మన భూమి. మరెవరిదో కాదు. ఈ నేల భాగ్యవంతులది మాత్రమే కాదు. బలవంతులైన అధికారవర్గం వారి సొంతమూ కాదు. ఉన్నత వంశీకుల ఆస్తీ కాదు. ఇది మనందరిదీ. ఈ భూమి మీదీ, నాదీ. మనం ఊరూ పేరూ లేని అల్పులమవచ్చు. కానీ మనం కూడా ఈ భూమి మీదే నివసిస్తున్నాం. మనందరమూ ఈ భూమి మీదే కలసి బ్రతకాలి; ఈ ప్రపంచం పేదవారిదీ, ధనవంతులదీ కూడా. పండితులతో పాటు బొత్తిగా విద్యాగంధం లేని వారిది కూడా. ఇది మన ప్రపంచం. ఈ గాఢ భావంతో మన వసుధను మనం ప్రేమించడం చాలా ముఖ్యం అని నేననుకుంటున్నాను. ఎప్పుడో ఒకసారి చాలా ప్రశాంతమైన ఉదయాల్లోనో, మరో సమయంలోనో కాకుండా ఎల్లప్పుడూ. స్వేచ్ఛ అంటే ఏమిటో మనకు అవగాహన అయినప్పుడు మాత్రమే ఈ ప్రపంచం మనది అనే అనుభూతి మనకు కలుగుతుంది. ఈ ప్రపంచాన్ని మనం ప్రేమిస్తాము.

*(పెంగ్విన్ – కృష్ణమూర్తి రీడర్)*

## మృత్యువుతో జీవించడం అంటే సేకరించుకున్న ప్రతిదానినీ ప్రతి రోజూ అంతమొందించడం

*(గత సంచిక తరువాయి)*

ప్రేమ అనే ఆ సౌగంధాన్ని కనిపెట్టాలంటే, ఏది ప్రేమ కాదు అనే అంశాన్ని పరిశీలించాలి. నకారాత్మకత ద్వారా, ఏది కాదో దానిని త్రోసి వేయడం ద్వారా సకారాత్మకతను, అంటే ఏది అవునో దానిని చేరవచ్చు. అంతేకాని, ఇటు నుండి అటుకాదు. నా మాటలు మీకు స్పష్టంగా ఉన్నాయా? ప్రేమ కానిదానిని నిరాకరించడం ద్వారా ఆ మహత్తర సత్యాన్ని దరిచేరవచ్చు. అదే ప్రేమ.

కాబట్టి ప్రేమ ద్వేషం కాదు అని ఏ సందేహం లేకుండా తెలిసింది కదా. అతి శయమూ, అహం భావమూ కూడా ప్రేమకాదు. అధికారం చేతుల్లో వుండదు ప్రేమ. ఒక చిన్న పాప మీద కానీ, ఒక జనసముదాయం మీదకానీ, ఒక దేశం మీదకానీ ఎవరిమీదయినా సరే అధికారం కలిగివుండటం, లేదా అధికారం కావాలని కోరుకోవడం నిశ్చయంగా అది ప్రేమకాదు. సుఖం ప్రేమకాదు. కోరిక ప్రేమకాదు. ఆలోచన ప్రేమకానేకాదు.

అందుచేత ఇవన్నీ పక్కకు పెట్టేయగలరా? మీ అతిశయాన్నీ, మీ అధికారభావాన్నీ. అది ఎంత తక్కువగా ఉన్నాసరే, అది ఒక పురుగు లాంటిది కదూ? ఎక్కువ అధికార బలం కలిగివుంటే ఇంకా పరమరోత. కాబట్టి అందులో ప్రేమ లేదు. మీలో చాలా ఆకాంక్షాపరత్వమూ, దూసుకొని పోయే తత్త్వమూ వుంటే – అట్లా ఉండేటట్లుగా మిమ్మల్ని పెంచారు– గొప్ప విజయం సాధించాలనీ, పేరు ప్రఖ్యాతి గణించాలి, అందరూ గుర్తించాలి అనీ కోరుకుంటుంటే – ఈ వక్ర దృష్టిలో అదంతా పరమవెర్రితనం – అటువంటప్పుడు అక్కడ ప్రేమ ఉంటుందా?

కాబట్టి, ప్రేమ అనేది పిలిచి ఆహ్వానించే విషయమూ కాదు, అలవరచుకొనేదీ కాదు. తక్కిన ఏవీ లేనప్పుడు అది సహజంగా, సులభంగా జనిస్తుంది.

☞ 2

*(1వ పేజీ తరువాయి)* . . .

# మృత్యువుతో జీవించడం అంటే సేకరించుకున్న ప్రతిదానినీ ప్రతి రోజూ అంతమొందించడం

తనని గురించి తాను నేర్చుకుంటున్నప్పుడు, ఎక్కడ ప్రేమ ఉంటుందో అక్కడ కరుణ ఉంటుందనీ, కరుణకి తనదైన తెలివి ఉంటుందని తెలిసివస్తుంది. ఇదే సర్వోత్కృష్టమైన తెలివి. అది ఆలోచనలు పన్నే మోసమూ, కపటమూ మొదలైన వాటికి సంబంధించిన తెలివి కాదు. సంపూర్ణమైన ప్రేమ, కరుణ ఉన్నప్పుడే యాంత్రికమైనది కానటువంటి సర్వోత్తమమైన ఆ తెలివి ఉంటుంది.

ఇప్పుడు మనం మరణం గురించి కూడా మాట్లాడుకోవాలి. ఏమంటారు? మరణం అంటే ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తి మీకు ఉన్నదా? 'మరణం' అనే ఆ మాటకు అర్థం ఏమిటి? చనిపోవడం, అంతమవడం అంటే ఏమిటి? అంతమవడమే కాదు, చనిపోయాక ఏం జరుగుతుంది? తమ జీవితకాలపు జ్ఞాపకాలను మోసుకొని వెళతారా? ఆసియా ఖండమంతటా పునర్జన్మ ఉన్నదనే నమ్మకాలు ఉన్నాయి. అంటే – నేను చనిపోతాను, నికృష్టమైన జీవితం గడిపాను, బహుశ కాస్తో కూస్తో మంచి పనులు చేసే ఉంటాను, మరు జన్మలో ఇంకా కాస్త మెరుగ్గా ఉంటాను, ఎక్కువ మంచి పనులు చేస్తాను. జీవితంలోని తక్కిన వాటిలాగే ఇది కూడా శిక్ష, ప్రతిఫలమూ మీద నిర్మించాం. క్రైస్తవ మతంలో పునరుజ్జీవించడం ఉన్నది. అందుచేత, ప్రస్తుతానికి ఇవన్నీ పక్కకు పెట్టి, నిజంగానే పక్కకు త్రోసివేసి, దీనికీ దానికీ దేనికీ కూడా పట్టుకొని వేళ్ళాడకుండా వుండి చూస్తూ – అప్పుడు మృత్యువు అంటే ఏమిటి? చనిపోవడం అంటే అర్థం ఏమిటి? శరీరంలో ప్రాణం పోవటం, భౌతికంగా మరణించడమే కాకుండా, మానసికంగా? అంటే – పోగుచేసుకున్న జ్ఞాపకాలూ, ప్రవృత్తులూ, నైపుణ్యాలూ, చాదస్తాలూ, సేకరించుకున్న విషయాలూ, అది డబ్బు అవచ్చు, జ్ఞానం అవచ్చు, స్నేహాలు అవచ్చు – ఏమయినా అనుకోండి, మీరు ఆర్జించినవి సమస్తమూ, మృత్యువు వచ్చి అంటుంది – "క్షమించండి, ఏదీ మీతో తీసుకొని పోలేరు" అని.

అందుచేత, చనిపోవడం అంటే ఏమిటి? ఈ ప్రశ్నను లోతుగా వెళ్ళి చర్చించుదామా? లేదూ మీకు భయంగా ఉన్నదా? మరణం అంటే ఏమిటి? దీనిని మనం ఏవిధంగా శోధించగలం? నా ప్రశ్న అర్థమవుతున్నదా? నేను బ్రతుకు వెళ్ళదీస్తున్నాను, ప్రతిరోజూ ఎట్లాగో గడుపు తుంటాను, దినసరి పనులు, యాంత్రికంగా, దారుణంగా, సంతోషంగా, విచారంగా – అవన్నీ ఆ వ్యవహారమంతా మీకు బాగా తెలుసు. ఇప్పుడు మరణం వస్తుంది. ప్రమాదం వల్లనో, వ్యాధిమూలంగానో, వృద్ధాప్యం వల్లనో, వార్థక్యం వల్లనో. వార్థక్యం అంటే ఏమిటి? అది వృద్ధులకే వస్తుందా? చేస్తున్నదే మళ్ళీ మళ్ళీ మళ్ళీ పునరుక్తి చేస్తూ వుంటే అది వార్థక్యం కాదూ? యంత్రాల లాగా ఆలోచనా రహితంగా పని చేస్తుంటే అది కూడా ఒక రకమైన వార్థక్యం కాదూ?

మృత్యువు అంటే మనం భయపడుతున్నాం కాబట్టి ఆ అద్భుతమైన దానిలో ఉన్న గొప్పతనాన్ని మనం చూడలేకపోతున్నాం. ఒక శిశువు జన్మించింది– ఒక కొత్త మనిషి అస్తిత్వంలోకి వచ్చాడు. ఇది చాలా అద్భుతమైన సంఘటన. ఆ శిశువు పెరిగి పెద్దవాడై మీ అందరూ ఎలా తయారయ్యారో అట్లాగే అయి, ఆ పైన చనిపోతాడు. చావు కూడా మహాఅద్భుతమైన విషయం. తప్పకుండా అయివుండాలి. మీరు భయపడుతూ కనుక ఉంటే దాని లోతునూ గొప్పతనాన్నీ చూడలేరు.

అందుచేత, మృత్యువంటే ఏమిటి? నేను బతికివున్నప్పుడే చావు అంటే ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నాను. నాకింకా వార్థక్యం రాలేదు; నా గ్రహణశక్తులన్నీ బాగా పనిచేస్తున్నాయి. బాగా స్పష్టంగా ఆలోచించ గలుగుతున్నాను. బహుశ అప్పుడప్పుడు అటూ ఇటూ అవుతుంటాను. కానీ నేను ఇంకా చురుకుదనంతో, స్పష్టంగా చూడగలిగే శక్తితో ఉత్సాహంగా ఉన్నాను. కాబట్టి నన్ను నేనే ప్రశ్నించుకుంటున్నాను – మిమ్మల్ని అడగడం లేదు. నేను కేవలం పరిశీలన చేస్తున్నాను. మీరు కూడా మృత్యువు అంటే ఏమిటో పరిశీలన చేస్తారా? మృత్యువు అంటే అన్నీ సమాప్తమవటం అనడంలో సందేహం లేదు. నా సంబంధ బాంధవ్యాలు ముగిసి పోతాయి. నా జీవిత కాలంలో నేను సమీకరించుకున్న పరిజ్ఞానమూ, సమస్త అనుభవాలూ అంతమవడం. నేను గడిపిన బుద్ధిహీన జీవితం, ఆ అర్థంలేని జీవితం లేదూ మేధాపరంగా ఈ జీవితానికి అర్థం కనిపెట్టాలని ప్రయత్నించడమూ అన్నీ ఆగిపోవడం. అప్పుడు మృత్యువు వచ్చి 'అంతా అయిపోయింది' అని అంటుంది. కానీ నాకు చాలా భయం వేస్తుంది. ఎట్లా అంతమవుతుంది అనుకుంటాను. నా వద్ద ఎంతో ఉన్నది. ఎన్నో సేకరించాను. ఎన్నో సామాన్లు, ఎన్నో కళాఖండాలూ. సామాన్లతో, కళాఖండాలతో, నా బ్యాంకు ఖాతాతో నన్ను నేను మమైకం చేసుకున్నప్పుడు నేనే సామాన్లూ, నేనే కళాఖండాలూ, నేనే బ్యాంకు ఖాతా అవుతాను. అవునా కాదా? ఏదైనా ఒక దానితో మిమ్మల్ని పూర్తిగా మమైకం చేసుకుంటే అదే మీరవుతారు. బహుశ ఇదంతా మీకు అంత ఇష్టంగా లేకపోవచ్చు. కాని దయచేసి వినండి. నేను బాగా ఇక్కడ పాతుకొని పోయాను. నా చుట్టూ ఎన్నో విషయాలను స్థాపించుకున్నాను. ఇప్పుడు మృత్యువు వచ్చి అన్నింటినీ శుభ్రంగా తుడిచిపెట్టేస్తున్నది. అందుచేత, ఎల్లప్పుడూ మృత్యువుతో జీవించడం సాధ్యమేనా అని నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను. ఎప్పుడో 90 ఏళ్ళు దాటాకో 100 ఏళ్ళు వచ్చాకో కాదు. ఈ వక్త వయస్సు 90– క్షమించండి. ఎప్పుడో జీవితపు ఆఖర్నకాదు; నాలోని ప్రాణ శక్తి, జవసత్వాలూ అన్నీ బాగున్నప్పుడే. అంటే ఆత్మహత్య చేసుకోవడం కాదు. నేను చెప్తున్నది అది కాదు. అది పరమ బుద్ధిహీనత. నేను అంటున్నది ఏమిటంటే మృత్యువుతో జీవించడం. అంటే అర్థం ప్రతిరోజూ సేకరించుకున్న ప్రతిదానినీ అంతమొందించడం. సమాప్తం చేయడం.

కొనసాగడం అంటే ఏమిటి, అంతమవడం అంటే ఏమిటి అనే ప్రశ్నల్ని మీరు ఎప్పుడైనా పరిశీలించారో లేదో నాకు తెలియదు. కొనసాగేది తనని తాను ఎన్నడూ పునఃప్రారంభించుకోలేదు, తిరిగి జన్మించలేదు. అది తనని తాను పునరుత్సాహ పరచుకోగలదు. అంటే, ఏదయినా వాడిపోయి, నిర్జీవంగా అవబోతుంటే దానికి పునరారోగ్యం ఇవ్వడం....

మతపరమైన పునరుజ్జీవనం గురించి గట్టిగా మన చెవులకి ప్రస్తుతం వినబడుతున్నది. మీరు ఇది గమనించారో లేదో కానీ, మత వ్యవస్థలూ,




**మనజీవితాలు**

జిడ్డు కృష్ణమూర్తి వ్యాఖ్యానాలు - 2
అబ్బూరి ఛాయాదేవిగారు అనువాదం.
చేసిన ఈ సరికొత్త ప్రచురణ విశాలాంధ్రవారి
విక్రయశాలలన్నింటిలో లభ్యమవుతుంది.
కె.ఎఫ్.ఐ చెన్నైయికి వ్రాసీ
తెప్పించుకోవచ్చును. ధర: రు120/-

గురువులూ మొదలైనవారంతా చాలా ఆస్తిపాస్తులు, సంపదలు కలిగినవారై వుంటున్నారు. దక్షిణ భారతదేశంలో ఒక దేవాలయం ఉన్నది. అక్కడ ప్రతిమూడవ రోజుకూ పది లక్షల డాలర్ల ఆదాయం ఆలయానికి వస్తూ వుంటుంది. అర్థమవుతున్నది కదూ? దేవుడు మంచి లాభదాయకమైన సంగతి. నేను వ్యంగ్యంకోసం చెప్పడంలేదు. ఇది నిజంగా జరుగుతున్న విషయం. మనం వాస్తవంగా జరుగుతున్నదానిని ముఖాముఖిగా పరిశీలిస్తున్నాం. ఆశావహంగానూ చూడకండి, నిరాశాపూరితంగానూ ఉండకండి. ఈ విషయాలను మీరు తప్పక సూటిగా పరిశీలించాలి.

సరే, నేను మృత్యువుతో కలిసి జీవించగలనా – అంటే నేను చేసినవి అన్నీ, నేను సేకరించుకున్నవి అన్నీ అంతమవగలవా? కొనసాగింపు కంటె అంతం చేయడం చాలా ముఖ్యమైనది. అంతం చేయడం అంటే ఏదో కొత్తదానిని ఆరంభించడం అనమాట. మీరు వూరికే ఆగకుండా కొనసాగిపోతూ వుంటే, అది ఒకే రకమైన నమూనా విధానాన్ని భిన్నమైన మూసలో పునరుక్తి చేయడం వంటిది. మరో వింతను మీరు గమనించారా? ప్రపంచాన్ని గందరగోళమయంగా మనం తయారు చేసుకున్నాం. మళ్ళీ మనమే ఆ గందరగోళాన్ని తొలగించుకోవడానికి రాజకీయపరమైన, మతపరమైన, సామాజికపరమైన వ్యవస్థలను తయారుచేస్తున్నాం. ఈ వ్యవస్థ లేక 'సంస్థ కనుక పని సాధించలేక పోతే మరొక సంస్థను సృష్టిస్తాం. సంస్థ తర్వాత సంస్థలని సృష్టించుకుంటూ పోతాం తప్ప గందరగోళాన్ని మాత్రం తొలగించుకోము. ఇట్లా కొత్త వ్యవస్థలను, కొత్త సంస్థలను నిర్మించుకోవడమే అభివృద్ధి, ప్రగతి అని అంటాం. ఇదంతా మీరు గమనించి చూశారో లేదో నాకు తెలియదు. మనం చేస్తున్నదల్లా ఏమిటంటే వేలాది సంస్థలను నిర్మించడం.

ఆమధ్య ఒకసారి మేము ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించాము. యుద్ధాలు జరుగుతునే ఉన్నాయి. వారు ఇది ఆపలేకపోయారు. అయితే కొత్త రకాలైన యుద్ధాల్ని పునః సృష్టిస్తున్నారు. మీ దేశంలో ప్రస్తుతం జరుగుతున్నది కూడా సరిగ్గా ఇదే. ఉన్న గందరగోళాన్ని సరిచేసుకోకుండా వ్యవస్థలని నిర్మించి అవి దీనినంతా సరిజేయాలని ఆశిస్తాం. లేదా అంటే కొత్త నాయకులు కొత్త గురువులు కొత్త మతాచార్యులు కొత్త విశ్వాసాలు మొదలైన పనికిమాలినవి తయారు చేసుకొని వాటిమీద ఆధారపడతాం. అందుచేత, మృత్యువుతో నేను జీవించగలనా? అంటే అర్థం, సంపూర్ణమైన, అఖండమైన, సమగ్రమైన స్వేచ్ఛ. ఆ స్వేచ్ఛలో గొప్ప ప్రేమ, కరుణ ఉంటాయి. గొప్ప తెలివి ఉంటుంది. దానికి ఒక ముగింపు ఉండదు. ఆ తెలివి అప్రమేయమైనది.

మతం అంటే ఏమిటి అనేది కూడా మనం మాట్లాడుకొనవలసి ఉన్నది. ఏమంటారు? మరీ ఎక్కువగా అలిసిపోయారా? దయచేసి ఈ వక్త మీకు ఏదో చెప్పి నమ్మింపజేయాలని ప్రయత్నిస్తున్నాడని అనుకోకండి. మిమ్మల్ని ఒత్తిడి చేసో, ఉత్తేజపరిచో, లేక మరో విధంగానో నమ్మింప చేయాలనుకోవడం లేదు. మీరు నేనూ కలసి ఈ ప్రపంచం వైపు, మీ వ్యక్తిగత ప్రపంచం వైపు, మీ చుట్టూ ఉన్న ప్రపంచం వైపూ చూస్తున్నాము. మీరే ఆ ప్రపంచం. ప్రపంచం మీ నుండి వేరుగా లేదు. ఈ ప్రపంచాన్ని తయారుచేసినది మీరే. దాని బాధ్యత మీదే. పూర్తిగా, సమస్తంగా మీదే బాధ్యత. మీరు రాజకీయ వేత్తకావచ్చు, సాధారణ పౌరుడవచ్చు. ఎవ్వరైనా సరే.

కాబట్టి, మతము అంటే ఏమిటి అనేది కలిసి మాట్లాడుకుందాం. ఈ బాధ, ఈ ఆందోళన, ఈ దుఃఖమూలకు అతీతంగా వున్నదాని కోసం మనిషి ఎప్పుడూ అన్వేషిస్తూనే ఉన్నాడు. పవిత్రమైనది, శాశ్వతమైనది, ఆలోచనా పరిధులకు అన్నింటికీ ఆవలగా ఉన్నది ఏదయినా ఉన్నదా? అతి ప్రాచీనకాలం నుండీ ఈ ప్రశ్నను వేసుకుంటూనే ఉన్నారు. పవిత్రమైనది అంటే ఏమిటి? కాలం లేనిదీ, భ్రష్టత చెందనిదీ, నామరహితమైనదీ, గుణరహితమైనదీ, అపరిమితమైనదీ అది ఏమిటి? కాలరహితమైనది, శాశ్వతమైనది ఏది? అటువంటిది ఏదయినా ఉన్నదా? ఈ ప్రశ్నను మానవుడు వేలాది సంవత్సరాలుగా అడుగుతూనే ఉన్నాడు. అందుచేత, సూర్యుడిని ఆరాధించాడు. భూమిని, ప్రకృతిని, వృక్షాలను, పక్షులను ఆరాధించాడు. ప్రాచీన కాలాల నుండి మనిషి భూమి మీద ఉన్న ప్రతిదానినీ ఆరాధించాడు. వేదాలు, ఉపనిషత్తులు దేవుడు అనే ప్రసక్తి ఎప్పుడూ తేలేదు. సర్వోత్కృష్టమైనది అవ్యక్తంగా ఉంటుందని వారు అన్నారు.

సరే, మీరు కూడా ఈ ప్రశ్నను అడుగుతున్నారా? పవిత్రమైనది ఏదయినా ఉన్నదా అని మీరు అడుగుతున్నారా? ఆలోచనలు తయారుచేసినది కానటువంటిది ఏదయినా ఉన్నదా? క్రైస్తవంలో, బౌద్ధంలో, హిందూ మతంలో, తక్కిన మతవ్యవస్థల్లో జరిగేది అదే కదా! బౌద్ధంలో దేవుడు లేడు. హిందువుల్లో సుమారుగా మూడు కోట్ల దేవుళ్ళు ఉన్నారు. అంత మంది ఉండటం తమాషాగా బాగుంటుంది. వారందరితోనూ ఆటలాడచ్చు. ఇక గ్రంథాలననుసరించి దేవుళ్ళు న్నారు. బైబిలుని అనుసరించి ఒక దేవుడూ, ఖురాన్‌ని అనుసరించి ఒకరూ. బైబిలు, ఖురాను వంటి గ్రంథాల మీద మతాలు ఆధారపడినప్పుడు ఆ విశ్వాసం గల మనుష్యులు మతదురభిమానంతో సంకుచితంగా, అసహనంగా ఉండటం మీరు గమనించారో లేదో నాకు తెలియదు. గ్రంథాలు చెప్తున్నాయి కాబట్టి అది అంతే అని వారంటారు. ఇదంతా మీరు పరిశీలనగా ఎప్పుడయినా చూశారా? గ్రంథాలను ప్రమాణంగా తీసుకునే మతఛాందసులు ఈ దేశంలో కూడా ఉన్నారు. దయ చేసి కోపం తెచ్చుకోకండి. ఇదంతా ఊరికే గమనించి చూడండి.

అందుచేత, మతం అంటే ఏమిటి అని మనం ప్రశ్నించుకుంటున్నాం. మతం ఒక్కటే కాదు, మతాత్మకమైన మెదడు, మతాత్మకమైన మనసు అంటే ఏమిటి? దీనిని పైపైన కాకుండా లోతుగా విచారణ చేయాలంటే సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండితీరాలి. ఏదో దీని నుండి స్వేచ్ఛ, దాని నుండి స్వేచ్ఛ అని కాదు. సంపూర్ణ స్వేచ్ఛ,

## ఆలోచన 'నేను'కు జన్మనిచ్చి పోషించకుండా ఉన్నప్పుడే మనసుకు స్వేచ్ఛ

ధ్యానం అంటే నిజంగా ఏమిటంటే మనసును పూర్తిగా ఖాళీ చేసి వేయడం. అప్పుడు శరీరం తన విధులను నిర్వర్తించడం మాత్రమే జరుగుతూవుంటుంది. సజీవ ప్రాణిలో జరిగే కార్యకలాపాలు ఉంటాయి. అంతే. ఇంకేమీ ఉండదు. అప్పుడు ఆలోచన 'నేను', 'నేను కానిది' అనే పేర్లు, గుర్తులూ పెట్టుకోకుండా పని చేస్తూ వుంటుంది. ఆలోచన యాంత్రికంగా పని చేస్తుంటుంది. ప్రాణి కూడా అంతే. సంఘర్షణను సృష్టించేది ఏదంటే, ఆలోచన తనలోని భాగాల్లో ఒకదానికి 'తాను' అనే పేరు పెట్టి దానితో మమైకం చెందడం. అదే 'నేను'గా, స్వీయంగా, 'నేను'లోని రకరకాల విభాగాలుగా తయారవుతుంది. ఈ నేను-స్వీయం యొక్క అవసరం ఏ సమయంలో కూడా లేనే లేదు. ఉన్నది ఒక్క శరీరం తప్ప వేరే ఏమీ లేదు. ఆలోచన 'నేను'కు జన్మనిచ్చి పోషించకుండా ఉన్నప్పుడే మనసుకు స్వేచ్ఛ-విముక్తి లభిస్తుంది.

('మెడిటేషన్స్' నుండి.)

స్వతంత్రమైన దేనికీ చెందని స్వేచ్ఛ ఉండాలి. అందుకని, మేము ప్రశ్నిస్తున్నది ఏమిటంటే, అటువంటి స్వేచ్ఛ ఉన్నప్పుడు, ఈ అసహ్యకరమైన ప్రపంచంలో జీవిస్తూ ఉన్నాకూడా దుఃఖము, ఆందోళన, బాధ, ఒంటరితనము లేకుండా ఉండటం సాధ్యమా అని?

ఇక, ధ్యానమంటే ఏమిటో కూడా మీరు తెలుసుకోవలసి ఉన్నది. క్రైస్తవుల దృష్టిలో చింతనాశీలత, ఆసియా దేశాల్లో ధ్యానమూ. బహుశ ధ్యానాన్ని ఈ దేశానికి తీసుకొచ్చినది యోగులు, గురువులు మొదలైన మూఢ విశ్వాసులూ, సాంప్రదాయ వాదులూ అయుంటారు. అందుచేత అది యాంత్రికంగా ఉంటుంది. సరే, ధ్యానం అంటే ఏమిటో మనం స్వయంగా కనిపెడదాం. అది తెలుసుకోవాలని అనుకుంటున్నారా లేదా? ఇదంతా ఏదో వినోదంగా అనిపిస్తున్నదా లేక నిజంగానే లోతుగా వెళ్ళి ఇది తెలుసుకోవాలనుకుంటు న్నారా? ధ్యానం వినోద కాలక్షేపం కోసం చేసేదా? ముందు నేను ధ్యానం నేర్చుకుంటాను. ఆ పైన సవ్యంగా ప్రవర్తిస్తాను అంటారా? మీరు ఆడే నాటకాలన్నీ మీకు అర్థమవుతున్నాయా? మీ జీవితంలో క్రమత కనుక ఉన్నట్లయితే మేము ఇంతకు మునుపు వివరించునటువంటి నిజమైన క్రమత కనుక ఉంటే, అప్పుడు ధ్యానమంటే ఏమిటి? జెన్ పద్ధతి, బౌద్ధుల ధ్యానవిధానము, హిందూ ధ్యానవిధానము, ఇప్పటి అధునాతన గురువుల పద్ధతులు - ఈ విధంగా ఏదో ఫలానా రకమైన పద్ధతులనో విధానాలనో అనుసరించడమా ధ్యానం అంటే? సాధారణంగా వీళ్ళందరికీ పెద్ద పెద్ద గడ్డాలుంటాయి. తక్కిన విశేషాలన్నీ మీకు బాగా తెలుసు - బాగా డబ్బు ఉంటుంది.

కాబట్టి, ధ్యానమంటే అసలు ఏమిటి? ఫలానా అని నిర్ణయింపబడినది కనుక అయితే, ఒక పద్ధతినో, పంథానో అనుసరించి ప్రతిరోజూ సాధన చేసేదీ కనుక అయితే అప్పుడు మానవమస్తిష్కం ఏమైపోతుంది? అది ఇంకా మందకొడిగా, జడంగా తయారవుతుంది. అది మీరు గమనించలేదా? అన్నదే మళ్ళీ మళ్ళీ మళ్ళీ జపం చేస్తుంటారు. అది అపశృతి అయినా సరే. అదే మళ్ళీ మళ్ళీ అంటారు. అందుచేత అసలు ధ్యానం అంటే వీటన్నింటికీ పూర్తిగా భిన్నమైనది కాదా? దానికి పద్ధతులతో, విధానాలతో, సాధనలతో ఏమాత్రమూ సంబంధం లేదు. అందుచేత అది ఏనాటికీ యాంత్రికమైనది కాదు. ధ్యానం చేస్తున్నాను అనే స్పృహ ధ్యానంలో ఉండదు. దయచేసి అది అర్థంచేసుకోండి. ఒకరు నాకు డబ్బు కావాలి, కావాలి అని అనుకుంటూ డబ్బు వెనక పడటం లాంటిదే ఇది కూడా. శాంతినీ, నిశ్శబ్దాన్నీ మొదలైనవాటిని సాధించాలి అని అనుకుంటూ మీరు ధ్యానం చేస్తుంటారు. అందుచేత ఆ రెండూ ఒకటే. డబ్బు, విజయసాధన, అధికారాల కోసం ప్రాకులాడే మనిషీ, ఆధ్యాత్మికత అని అనబడే దానికోసం ప్రాకులాడే మనిషీ ఇద్దరూ సమానమే.

సరే ఫలానా అని నిర్ణయింపబడనిదీ, సాధన చేయబడనిదీ అయిన ధ్యానం ఉన్నదా? ఉన్నది. అయితే దానికి బ్రహ్మాండమైన సావధానశీలత కావాలి. ఆ సావధానత ఒక అగ్నిజ్వాల. అది ఎప్పుడో ఒకనాటికి మీరు చేరుకునే సావధానత కాదు. అది ఇప్పుడే, ప్రతిదాని ఎడల, ప్రతిమాట ఎడల, ప్రతి శరీర కదలిక ఎడల, ప్రతి ఒక్క ఆలోచన ఎడల సావధానత ఇప్పుడు కలిగి ఉండటం. సంపూర్ణమైన, పాక్షికమైనది కానటువంటి సావధానత చూపడం.మీరు కనుక ఇప్పుడు పాక్షికంగా సగం సగం వింటుంటే మీ సంపూర్ణ సావధానతను చూపడం లేదనమాట. మీరు సంపూర్ణ సావధానతను చూపుతున్నప్పుడు అక్కడ నేను - స్వీయం ఉండదు. పరిమితులు ఉండవు.

ప్రస్తుతం మెదడు సమాచారంతో నిండిపోయి ఉన్నది. క్రిక్కిరిసిపోయి ఉన్నది. ఎక్కడా చోటు లేదు. అయితే మనకి ఆ చోటు - ఎడం ఉండితీరాలి. ఎడం - స్థలం అంటే శక్తి. స్థలం లేకుండా వున్నప్పుడు మీ శక్తి చాలా చాలా పరిమితమైపోతుంది. మెదడు ప్రస్తుతం జ్ఞానంతో నిండిపోయి, సిద్ధాంతాలతో, అధికారంతో అంతస్థులతో నిండిపోయి ఆ భారంతో క్రుంగిపోయి ఉన్నది. అందుచేత అంతులేని సంఘర్షణలతో నిండి క్రిక్కిరిసిపోయి వున్నది. ఇక అక్కడ ఏమాత్రం చోటు లేదు. స్వేచ్ఛ, సంపూర్ణమైన స్వేచ్ఛ అంటే అవధులు లేనంత స్థలంకలిగివుంటం. మెదడుకు అపారమైన శక్తియుక్తులున్నాయి. అనంతమైన సామర్థ్యం కలిగివున్నది. కానీ మనం దానిని చాలా సంకుచితంగా, అల్పంగా చేసివేశాం. అందుచేత, ఎక్కడైతే చోటు, ఖాళీ స్థలం వున్నదో, ఆ కారణంగా అపరిమితమైన శక్తి వుంటుందో - ఆ శక్తే గాఢో ద్వేగం, ప్రేమ,కరుణ, తెలివి కూడా - అటువంటి శక్తి వున్నప్పుడు అక్కడ సత్యం ఉంటుంది. ఆ సత్యం అత్యంత పవిత్రమైనది, అత్యంత పునీత మైనది. దీనినే మానవుడు ప్రాచీనకాలంనుండీ చిరంతనంగా అన్వేషిస్తున్నాడు. ఆ సత్యం ఏ దేవాలయాల్లోనూ ఉండదు; ఏ మసీదులోనూ ఉండదు. ఏ చర్చిలోనూ ఉండదు. దాని వద్దకు ఏ మార్గమూ లేదు. ఉన్నదల్లా ఒకే ఒకటి - తనని తాను అవగాహన చేసు కోవడం, విచారణ చేయడం, అధ్యయనం చేయడం, నేర్చుకోవడం ద్వారా మాత్రమే. అప్పుడు చిరంతనమైనదీ, శాశ్వతమైనదీ అక్కడ ఉంటుంది.

(1985 లో ఏప్రిల్ 21న వాషింగ్టన్‌లో చేసిన ప్రసంగ భాగం) ■

# 'ఎక్కువ' అనే ప్రసక్తి లేకుండా మనసు ఆలోచించగలదా?

**ప్రశ్న: ఈర్ష్యను నాలో లేకుండా చేసుకోవడం దాని నుండి విముక్త మవడం ఎలా?**

***కృష్ణమూర్తి:*** ఈర్ష్య అంటే ఏమిటి? ఈర్ష్య అంటే 'ఇంకా ఎక్కువ', కావాలనే కోరిక కాదూ? ఇంకా ఎక్కువగా కావాలి, పొగడ్తలూ అవగాహనా ఇంకా కావాలి-వస్తువులు ఇంకా ఎక్కువెక్కువగా కావాలి, ఊహలూ, జ్ఞానసంపదా ఎక్కువగా కావాలి. 'ఇంకా ఎక్కువ', అని అన్నప్పుడు అందులో పోల్చిచూడటం వుంటుంది. అవునా కాదా? దయ చేసి జాగ్రత్తగా వినండి. ఈర్ష్య మనకు పూర్తిగా లేకుండా పోవడం సాధ్యమని మీరే తెలుసుకుంటారు.

ఎప్పుడో భవిష్యత్తులో ఒక రోజున కాదు తక్షణమే, ఒక్క క్షణంలో తెలుసుకోగలుగుతారు. ఎప్పుడంటే - "ఈర్ష్య తిష్ఠ వేసుకొని కూర్చునేది మనసులో" అనే ఆ వాక్యంలోని సత్యాన్ని ఎలా వినాలో మీరు తెలుసుకుంటే కనుక. మనసు ఎప్పుడూ అంతు అనేది లేకుండా ఎక్కువ కావాలి, ఇంకా ఎక్కువగా కావాలి అని అడుగుతూనే ఉంటుంది. అసలు మన నాగరకత నిర్మించబడినది ఆ పునాది మీదే. ఎక్కువగా ఆర్జించాలి, ఆస్తిపాస్తులు ఎక్కువ కావాలి, డబ్బు ఎక్కువ కావాలి, ఇంకా కావాలి, ఇంకా కావాలి, ఇంకా కావాలి. అందుచేత ఎప్పుడూ పోల్చి చూడటం అనేది వుంటూనే వుంటుంది. కాబట్టి, ఎప్పుడూ పోరాటమే - ముగింపు లేని పోరాటం. ఈర్ష్యవున్నదని తెలుసుకున్నాం కాబట్టి, ఈర్ష్యారాహిత్యాన్ని తప్పక అలవరచుకోవాలి అని అంటాం. అది కూడా మరోరకమైన 'ఎక్కువ' యే. అంటే నకారాత్మకంగా. అందుచేత, అసలు 'ఎక్కువ' అనే ప్రసక్తి 'ఎక్కువ'తో సంబంధమే లేకుండా ఆలోచించడం, ఉన్నదానిని పోల్చి చూడకుండా, విలువను నిర్ణయించకుండా వుండటం మనసుకు సాధ్యమా, చేయగలదా?

**వినతి**

**'అంతరంగయాత్ర' చదవాలనే ఆసక్తి గలవారి చిరునామాలు పంపండి. ఉచితంగా పత్రిక వారికి పంపుతాము. గ్రంధాలయాల, విద్యాసంస్థల, కార్యాలయాల చిరునామాలు కూడా పంపవచ్చును.**

అంటే ఇది కదలిక లేకుండా జడమై పోవడం కాదు. కాకపోగా, మనసు 'ఎక్కువ' కోసం ఆరాటపడకుండావున్నప్పుడు, పోల్చిచూస్తూ వుండనప్పుడు – అప్పుడు మీకు ఇక కాలంతో పనే ఉండదు.

కాలం అంటే అందులో అంతర్లీనంగా 'ఎక్కువ' ఉంటుంది. "రేపు నేను ఫలానాగా అవుతాను' ; "ధనవంతుడిని అవుతాను"; "రేపు నెరవేర్చుకుంటాను";" ప్రేమను పొందుతాను"; "నేను ప్రేమిస్తాను" "భవిష్యత్తులో సంతోషంగా ఉంటాను"– మొదలైనవి.

పోల్చి చూసే మనసు, 'ఎక్కువ' కావాలని అడుగుతున్న మనసు కాలంతో ముడివేసుకున్న మనసు, రేపటి మనసు. అవునుకదూ? కాబట్టి, అటువంటి మనసు, 'నేను ఈర్ష్య పడకూడదు' అని అంటుంటే అది కూడా మరొక రూపంలోని కాలమే అవునా? ఇంకొక రకమైన పోల్చిచూడటం కూడా ఉంటుంది. ''నేను ఇలా వుంటూ వచ్చాను. ఇక ముందు అంతకంటే తగ్గించు కుంటాను" కనుక, 'ఎక్కువ' కావాలని కోరు కుంటున్న మనసు, 'ఎక్కువ' కావాలి అని కోరుకోవడమే ఈర్ష్య అంటే – దానిని పూర్తిగా మానివేయగలదా? సర్! అసలు సమస్య మీకు అర్థం అవుతున్నదా?

అసలు సమస్య ఈర్ష్యను పోగొట్టుకోవడం ఎలా అనేది కాదు. అది చాలా చిన్న సంగతి. సమస్య ఏమిటంటే ఈ 'ఎక్కువ' అనే ప్రసక్తి లేకుండా ఆలోచించటం ఎలా; పోల్చిచూసే పద్ధతిలో ఆలోచించకుండా వుండటం ఎలా, కాలంతో సంబంధించి ఆలోచించకుండా వుండటం ఎలా; "నేను ఇక ఫలానాగా వుంటాను" అనే రకంగా ఆలోచించకుండా వుండటం ఎలా అనేది. మనసు ఎప్పటికైనా 'ఎక్కువ' కు సంబంధించకుండా ఆలోచించగలదా? అది సాధ్యం కాదు అని అనకండి. మీకు తెలియదు. మీకు తెలిసినది అంతా ఆ 'ఎక్కువ' – ఎక్కువ జ్ఞానం, ఎక్కువ పరపతి, ఎక్కువ దుస్తులు, ఎక్కువ ఆస్తి పాస్తులు, ఎక్కువ ప్రేమ. 'ఎక్కువ' కనుక మీకు దొరకక పోతే, 'తక్కువ', ఇంకా 'తక్కువ', ఇంకా 'తక్కువ' కావాలి.

సరే, ఈ రకంగా ఏమాత్రం ఆలోచించకుండా వుండటం మనసుకు సాధ్యమేనా?మొదట ఆ ప్రశ్నను వేసుకోండి. ఈర్ష్యను పోగొట్టు కోవడంలో నాకు తోడ్పడటం కాదు, కానీ, 'ఎక్కువ' అనే రకంగా మనసు ఆలోచించడం ఆపివేయగలదా? ఆ ప్రశ్న వేసుకోండి, వినండి. ఇప్పుడు మాత్రమే కాదు, మీరు ఇంటికి వెళ్ళాక, బస్సులో వెళ్తున్నప్పుడు, రైల్లో ఎక్కుతున్నప్పుడు, ఒంటరిగా నడచివెళ్తున్న ప్పుడూ, ఒక చీరెను చూసినప్పుడూ. ఒక పెద్ద కారులో వెళ్తున్న మనుష్యులని, ఒక పెద్ద రాజకీయవేత్తను, గొప్ప వ్యాపారవేత్తను చూసినప్పుడు ఆ ప్రశ్నను వేసుకోండి. వినండి. తెలుసుకోండి. అప్పుడు అందులోని సత్యాన్ని కనిపెడతారు. అప్పుడు ఆ సత్యమే మీ మనసుకు 'ఎక్కువ' నుండి విడుదల కల్పిస్తుంది. మనసు అప్పుడు ఈ 'ఎక్కువ'ను వదిలించుకోవాలని ప్రయాసపడుతున్న స్పృహతో ఉన్న పైపై మనసు కాదు. 'ఎక్కువ' కావాలని అడగకూడదని ప్రయత్న పూర్వకంగా ప్రయాసపడుతుంటే అది కూడా మరొక రకమైన, అంటే నకారాత్మకంగా 'ఎక్కువ'ను కోరడమే. అందుచేత దీనిలో మన ప్రశ్నకి సమాధానం దొరకదు. ఈ ప్రశ్నను మీరు వేసుకున్నప్పుడు, తప్పొప్పుల తీర్పు చేయకుండా, ఒక ఫలితం కోసం అపేక్షించకుండా, ఒక ఫలానా చర్య జరగడానికి దీనిని ఉపయోగించాలని కోరుకోకుండా వుండిపోతేనే మీకు అది వినబడుతుంది. దానిని వింటున్నప్పుడు మాత్రమే సత్యం ఉనికిలోనికి రావడం సాధ్యమవుతుంది. అది మనసును 'ఎక్కువ' నుండి విడిపిస్తుంది.

*(బొంబాయిలో ప్రసంగాలు – 1953)*

■

# జీవిత లక్ష్యము

## (ఏకైక విప్లవం నుండి)

ధ్యానము అంతము లేకుండా సాగెడి ప్రవాహము. "నేనిప్పుడు ధ్యానము చేస్తూవున్నా" నని మీ రెన్నడూ చెప్పలేరు. అట్లే ధ్యానము కోసమై వేరుగా కొంత సమయాన్ని కేటాయించలేరు. అది మీ చెప్పుచేతులలో వుండేది కాదు. రమ్మంటే రావడానికి పొమ్మంటే పోవడానికి. మీరు నియమబద్ధమైన జీవితం గడుపుతున్నారు కాబట్టి, ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రకారం మీ దిన చర్య సాగుతున్నది. కాబట్టి ధ్యానము యొక్క దివ్యాశీస్సు మీకు లభిస్తుందనడానికి వీలు లేదు. మీ హృదయము నిజంగా తెరుచుకొని వున్నప్పుడే అదిలభిస్తుంది; అయితే అది ఆలోచనయనే తాళపుచెవితో తెరువబడదు. బుద్ధి చాతుర్యముచే దానికి భద్రత కలిగించినప్పుడు కాదు. మేఘావృతము కాని నిర్మలాకాశమువలె హృదయము తెరుచుకొని వుండాలి. అప్పుడా దివ్యాశీస్సు మీకు తెలియకుండానే వస్తుంది. మీ ఆహ్వానము అవసరము లేదు. దానిని మీరు భద్రపరచుకోనూలేరు, దానికి కాపలా కాయనూ లేరు. దానిని ఆరాధించనూలేరు. మీరందుకై ప్రయత్నిస్తే మళ్ళీ అది మీ దగ్గరికి రాదు. దానికోసమై మీరేమైనా చేయండి. అది మిమ్ము తప్పించుకొని పోతుంది. ధ్యానములో మీరు కాదు ముఖ్యము. అందులో మీకు తావు లేదు. అందలి సౌందర్యము మీరు కాదు, దానిది సహజసౌందర్యము. ఆ సౌందర్యానికి అదనంగా మీరు జోడించగల్గినది యేమీ లేదు. దానిని ఏ మార్చి తటాలున పట్టుకొందామనే ఆశతో కిటికీ గుండా బయటకి చూచి లాభంలేదు. అట్లే దానికోసమై దీపాలార్పిన చీకటి గదిలో కూర్చుండి యెదురు చూచిలాభంలేదు. అసలు మీరక్కడ బొత్తిగా లేనప్పుడే అది వస్తుంది. మీ రున్నప్పుడు రాదు. దాని వలన కలిగే ఆనందము అట్లే కొనసాగుతూ వుండదు.

ఎత్తైన ఆ కొండల ప్రక్కనే అపారపారావారము నీల వర్ణము కలిగి మైళ్ళ కొలది పరుచుకొని వున్నది. ఆ కొండల మీద ఏవో కొన్ని చిన్న చిన్న పొదలు తప్ప మరేమి పెరగవు. ఎండకు ఎండి, అగ్గికి కాలి అయినా అవి జీవముతో అట్లే వున్నాయి వర్ధిల్లుతూ ప్రశాంతంగా ఏకాంతంలో. అందులో ముఖ్యంగా ఒక బ్రహ్మాండమైన పాత ఓకువృక్షము తన చుట్టూ వున్న కొండలమీద పెత్తనం చెలాయిస్తున్నట్లుగా కనిపిస్తుంది. మరియొక కొండకొమ్మున ఎండి కాలిపోయిన ఒక నిర్జీవ వృక్షము నగ్నముగా, ఒక్క ఆకంటూ లేకుండా బూడిద రంగుతో నిలబడి వున్నది. ఆ కొండలను వాటి అందాన్ని నీలాకాశములో గీచినట్లున్న ఆ కొండల అందచందాలను చూచినప్పుడు ఈ యెండిన చెట్టొక్కటే ఆకాశాన్నంతను పడిపోకుండా మోస్తున్నట్లు అనిపిస్తుంది. ఉండడానికైతే దానికి చాలా కొమ్మలేవున్నాయి. కాని అవన్నీ యెండి నిర్జీవములైనవే! వసంత కాలములో అవి మరల చిగురించవు. అయినా ఆ చెట్టు అందమూ, ఆకర్షణ కలిగి అత్యంత సజీవముగా కనిపిస్తుంది. మనమూ ఆ చెట్టులో కలిసిపోయి, ఒంటరిగా,

కాలానికి అతీతంగా, దేని మీద ఆధారపడకుండా వున్నట్లు అనుభూతిని పొందుతాము. లోయలోని ఆ పెద్ద ఓకుమ్రానువలె. ఇది కూడా కలకాలమట్లే వుండిపోతుందని అనిపిస్తుంది. ఇందులో ఒకటి సజీవము, రెండవది నిర్జీవము. ఎండకెండి, అగ్గిలోకాలి శీతాకాలవర్షముల కోసం ఎదురుచూస్తూవున్న యీ సజీవనిర్జీవములైన ఆ రెండు వృక్షములలో జీవితమునంతను, మన జీవితముతో సహా సమస్త జీవితమును చూశాము. ఆ రెండింటి మధ్య భద్రముగా, అంతర్లీనమై దేనినీ ఆశించనిదై వుంటుంది ప్రేమ.

మా ఇంటిని ఆశ్రయించుకొని ఒక తల్లి రకూన్ తన నలుగురు పిల్లలతో నివసిస్తూంటుంది. మే మా యింటికివచ్చిన రోజున మా కవి వరండాలోనే దర్శనమిచ్చాయి. ఉంగరాల కుచ్చుతోక కలిగి మాంసాహారియైన చిన్న సైజు జంతువు, ఇది నక్కవలె వుంటుంది. అమెరికా దేశము దీని నివాసస్థలము. వాటి కన్నులు నల్లటివి, చుఱుకైనవి. వాటి పాదాలు మృదువుగా వుంటాయి. మేము రాగానే అవి మాతో స్నేహం కట్టినాయి. జంకుతూ జంకుతూ తిండికోసం మాచుట్టూ తిరగసాగినాయి. తల్లి మాత్రం దూరంగానే వుండిపోయింది. మరునాటి సాయంత్రం అవి మళ్ళీ వచ్చినాయి. నేరుగా మా చేతులలో నుండియే మెత్తగా తగిలినాయి. ఎవరైనా వాటిని మచ్చిక చేసికోదలుచుకొంటే వాటిని ముద్దు చేయదలచుకొంటే అవి సిద్ధం. వాటి అందానికి ముచ్చటగొలిపే వాటి నడకలకు మీరు ఆశ్చర్యపోతారు. కొద్ది దినములలోనే అవి మీకు బాగా అలవాటై మీ మీ దెక్కి తిరగడం మొదలు పెడతాయి. అపరిమితమైన జీవచైతన్యాన్ని మీరు వాటిలో చూడగలరు.

అది ఒక మనోజ్ఞమగుదినము. అకాశమునిర్మలముగా వున్నది. వాతావరణము ప్రశాంతముగా వున్నది. తెల్లని యెండలో ప్రతి మొక్క, ప్రతిపొద, దేనికది స్పష్టంగా కనబడుతున్నాయి,. అతడు లోయలోనుండి కొండమీద కెక్కి ఇంటికి వచ్చినాడు. ఇక్కడ నుండి చూస్తే ప్రక్కనే క్రింద ఒక కొండవాగు కనబడుతుంది. అది దాటిపోతే వరసగా అన్నీ కొండలే. ఈ యింటికి సమీపంలో కొన్ని దేవదారు వృక్షాలు మరికొన్ని పొడవైన వెదుళ్ళు వున్నాయి.

భవిశష్యత్తు మీద పూర్తిగా నమ్మకమున్న ఒక యువకుడతడు. నవ నాగరికత యొక్క క్రూర హస్తమింకను అతనిని తాకలేదు. అతనికి కావలసినదల్లా ప్రశాంతంగా కూర్చోవడం, మౌనంగా వుండిపోవడం. అతని మౌనానికి అక్కడి కొండలే కాదు, అతనిలోని తీవ్రమైన తపన తెచ్చిపెట్టిన ప్రశాంతత కూడా కారణమే.

ఈ ప్రపంచములో నా పాత్ర యేమిటి? ప్రస్తుతమున్న యీ సహజవ్యవస్థ అంతటితో నాకు గల సంబంధమేమిటి. ఈ ఎడతెగని సంఘర్షణకు గల అర్ధమేమిటి? నేనొకరిని ప్రేమించినాను, ఇద్దరమూకలిసి పడుకొంటాము. కాని అంతటితో జీవితలక్ష్యమేడేరినట్లేనా? ఇదంతా ఒక సుదూరస్వప్నంలాగా మాటిమాటికి చెదిరిపోతూ మళ్ళీ వస్తూ, ఒక క్షణం చైతన్యంతో తొణికిసలాడుతూ మరుక్షణం అర్ధశూన్యమైపోతూ కనబడుతుంది. నా స్నేహితులు కొందరు మత్తు మందులకలవాటు పడటం నేనెరుగుదును. తత్ఫలితంగా వారు మందబుద్ధులై మత్తుగా పడివుంటారు. వారిలోని చుఱుకుదనమంతా నశించి పోయింది. బహుశా నేనుకూడా మత్తు మందులకలవాటుపడకపోయినా వైవిధ్యము లేని దైనికజీవితము కారణంగా నా ఒంటరితనము వలన కలిగెడి వ్యధకారణంగా జడ మతినైపోవచ్చును. కోట్ల కొలది జనాభాతో నా కెట్టి సంబంధమూ లేదు, అయినా నా జీవితమూ వారిలాగే అంతరించిపోతుందేమో. అనశ్వరమై, అచోరహారమై అక్షీణకాంతివంతమైన అమూల్యరత్నమును పొందకుండానే బహుశా నా జీవితము కూడా వ్యర్ధమైపోవచ్చును. అందువలన ఇక్కడికి మీ వద్దకు వచ్చి మీకవకాశ మున్నట్టయితే ఈ విషయమై మీతో చర్చించుదామని అనుకొన్నాను. నా ప్రశ్నల కేవో సమాధానాలు కావాలని కోరుకొనడంలేదు. నా మనస్సంతా వికలమైవున్నది. వయస్సులో చిన్నవాణ్ణే అయినా, నాలో ఉత్సాహ మంతరించిపోయినది. నా చుట్టూ ఆశలుడిగిన ప్రాతతరం వారిని చూస్తాను. వారిలో ఒకరి కొకరికి పడదు. క్రౌర్యము, కపటము నీచానికి దిగజారడం అతి ఆలోచన, ఇవీ వారి లక్షణాలు వారి తరులకివ్వగలిగింది ఏమి లేదు. పైగా వారి దగ్గర నుండి నేనేమి తీసికొన గోరనుగూడ. అసలు నాకేమి కావాలో నాకే తెలియదు. కాని సుసంపన్నమై సార్ధకమైన నిండు జీవితాన్ని గడుపవలెనని మాత్రము తెలియును. ఏదైనా ఒక ఆఫీసులో చేరి, అర్ధరహితమై వాలూ వంకలేని ఆ జీవితములో క్రమక్రమంగా ఎదిగి పై స్ధానానికి చేరవలెనని నాకే మాత్రము కోరిక లేదు. ఒకొక్కప్పుడు నా యేకాకి తనాన్ని, అందరాని, సుదూరాకాశములో ప్రకాశించెడి తారల సౌందర్యాన్ని తలచుకొని నాలోనేనే కుమిలి పోతాను.”

కొంత సేపు మేము మౌనంగా కూర్చున్నాము. సముద్రము మీద నుండి వచ్చే పిల్లగాలులకు దేవదారులూ, వెదుళ్ళూ తలలాడిస్తూ వున్నాయి.

భరద్వాజపక్షిగాని, గరుడపక్షిగాని మరేపక్షిగాని ఎగిరేటప్పుడు ఆకాశంలో అవి తమ జాడలను వదిలిపెట్టవు. కాని విజ్ఞాన శాస్త్రవేత్త తన అడుగుజాడలను వదిలిపోతాడు; అట్లే ఇతర నిపుణులందరును. మనం వారి అడుగుజాడలలో నడువవచ్చు. వారు కనుగొని మనకు వదిలిపెట్టిపోయిన జ్ఞాన భండారానికి మనం మరికొన్ని అడుగులను కలుపవచ్చు. వారు సేకరించిన జ్ఞానము ఏ దిశగా ఏ ఉద్దేశముతో సాగినదో చాలా వరకు మనం తెలిసికోవచ్చు. కాని సత్యమటువంటిది కాదు. నిజానికి దానిని చేరుకోవడానికి మార్గమంటూ ఏది లేదు.

■

(తక్కినది వచ్చే సంచికలో)

*Published in August, December & April*
*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

Periodical

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*